మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం

**మె**డికేటెడ్ మాస్క్ ముక్కుకి కట్టుకుని రూమ్‌లోకి వచ్చాడు రఘురామ్. అతని అడుగుల చప్పుడు విని కళ్ళు తెరిచింది కమల. ఫ్లాస్క్‌లో ఉన్న పాలు పోసి గ్లాసు ఆమెకు అందించాడు. ఇంతలో నర్స్ వచ్చి ఇంజెక్షన్ చేసింది.

"సిస్టర్! ఫీవర్ తగ్గిందా?" అడిగాడు రఘురామ్.

"ఇప్పుడైతే లేదు. వస్తూ పోతూ వుంది" చెప్పింది నర్స్.

"ప్రాబ్లమ్ ఏమిటి? స్వైన్ ఫ్లూనా?"

"కన్ఫర్మ్ కాలేదు" అని వెళ్ళింది నర్స్.

మూడు రోజుల క్రితం కమలకు తీవ్రంగా జ్వరం వచ్చింది. కాలనీలోని క్లినిక్‌కి తీసుకెళ్ళి చూపిస్తే హాస్పిటల్లో అడ్మిట్ చెయ్యమన్నాడు. కమలకు జ్వరంతోపాటు దగ్గు కూడా వుంది. తుమ్ములు కూడా వస్తున్నాయి. సిటీలో ఇప్పుడు ఎవరు దగ్గినా, తుమ్మినా పక్కనున్న వాళ్ళు హడలిపోతున్నారు.



# బంగారు గాజులు

**-వాణిశ్రీ**

విదేశాల నుంచి స్వైన్ ఫ్లూ అనే వ్యాధి దిగుమతి అయిందని టీవీ ఛానెళ్ళు వూదరగొడుతుంటే జనం భయపడిపోతున్నారు. ముక్కులకు మాస్కులు కట్టుకునిగాని ఇల్లు కదలడం లేదు.


ఆ స్వైన్ ఫ్లూ తమ ఇంటిదాకా వచ్చిందని హడలిపోయి కమలను జయా నర్సింగ్ హోమ్‌లో చేర్చాడు రఘురామ్. ఏవో టెస్టులు చేసి మూడు రోజులకు పదిహేను వేలు బిల్లు కట్టమనేసరికి బెంబేలెత్తి పోయాడు. అతనికి కమలతో పెళ్ళయి రెండేళ్ళయింది. ఆర్నెల్లక్రితమే అబార్షనయింది. అప్పట్నుంచి ఆమె నీరసంగానే వుంటోంది. ఇంకా కోలు కోలేదు. పుట్టింటి వాళ్ళు తీసుకెళ్ళి నెలరోజులుంచుకుని పంపారు. ఇప్పుడీ జ్వరం పీడిస్తోంది. కమలను ఇంకెన్నాళ్ళు హాస్పిటల్లో వుంచుతారో? ఎంత ఖర్చు అవుతుందోనని రఘురామ్‌కి దిగులు పట్టుకుంది.

రెండు రోజుల తర్వాత జ్వరం కంట్రోల్లోకి వచ్చింది. కమలను డిశ్చార్జి చేశారు. ఐదువేలు బిల్లు కట్టి బైటపడి 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు. జ్వరం రాకపోయినా కమల మామూలు మనిషి కాలేదు. మందులు వాడమనీ, జ్వరం వస్తే తీసుకురమ్మని హాస్పిటల్ వాళ్ళు చెప్పారు. రఘురామ్ తల్లిని రమ్మని ఫోన్ చేస్తే పొలం పనులు, ఇప్పుడు రావడం కుదరదు అని చెప్పింది. కమల తన తల్లిని పిలిపించుకుంది.



## గ్లామర్‌లేని సమీరా!

గ్లామరస్ హీరోయిన్‌గా ఇప్పటిదాకా మనకు కనిపించిన సమీరారెడ్డి ఇప్పుడో డీగ్లామరైజ్డ్ పాత్రని ఒప్పుకుంది. నాగేష్ కుకునూర్ రూపొందించే 'ఏ హోస్లా' అనే చిత్రంలో రాజస్థానీ పల్లెటూరి అమ్మాయిగా నటించబోతోందిట. ఇందులో ఆమెకి అస్సలు గ్లామర్ వుండదుట. అలాగే పల్లెటూరి బైతు తరహా గెటప్‌లో ఎంతో రఫ్‌గా కనిపించబోతోందిట. ఇలాంటి పాత్ర దొరకడం తన అదృష్టంగా భావిస్తున్నానంటోంది సమీరా.




మళ్ళీ జ్వరం వస్తే హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళాల్సి వస్తుందని లోలోపల గుబులుగా వుంది రఘురామ్‌కి. ఎందుకైనా మంచిదని జి.పి.యఫ్. అడ్వాన్సు కావాలని ఆఫీసులో అప్లికేషన్ పెట్టాడు. ఆ డబ్బు చేతిలో పడేసరికి ఇరవై రోజులపైనే పడుతుంది. ఈ లోపల డబ్బుతో అవసరం పడితే ఎట్లా? అని అతనికి దిగులు పట్టుకుంది.

వెయ్యి, రెండు వేలైతే కొలీగ్స్‌ని అడగొచ్చు. ఎవరో ఒకరు సర్దుతారు. అంతకంటే ఎక్కువ ఎవరిస్తారు? ఊరెళ్ళి తండ్రిని అడిగితే...ఏ షావుకారు దగ్గరో అప్పు తెచ్చిస్తాడు. కాని అది తనకి ఇష్టం లేదు. ఇప్పటికే 'ఏడేళ్ళ నుంచి ఉద్యోగం వెలగబెడుతున్నావ్! ఏం సంపాదించావ్?' అని ఎత్తి పొడుస్తున్నాడు. ఇక అప్పుకోసం వెళ్తే జీవితాంతం ఎగతాళి చేస్తూనే ఉంటాడు. రఘురామ్‌కి మెరుపులా ఒక ఆలోచన వచ్చింది.

"కమలా! మళ్ళీ ఫీవర్ వస్తే హాస్పిటల్‌కి తీసుకు రమ్మన్నారు నిన్ను. డబ్బు అప్పటికప్పుడు సర్దుకోవాలంటే ఎలా? అందుకే నీ బంగారు గాజులు తాకట్టు పెట్టి డబ్బు తెస్తానోయ్! ఏం?" అన్నాడు.

కమల ఉలిక్కిపడింది.

"మళ్ళీ హాస్పిటల్‌కా? వద్దండీ! వేలకు వేలు వసూలు చేస్తారు. కాలనీలో డాక్టర్ దగ్గరికి వెళ్దాం అంతగా ఫీవర్ వస్తే!" అన్నది.

"భలేదానివి. ఆ డాక్టరేగా హాస్పిటల్‌కి వెళ్ళమన్నది. మళ్ళీ ఆయన దగ్గరికెళ్తే నవ్వుతాడు. ట్రీట్‌మెంట్ ఎక్కడ మొదలుపెట్టారో మళ్ళీ అక్కడికి వెళ్ళాల్సిందే తప్పదు" అని నిట్టూర్చాడు.

"అమ్మ దగ్గర కొంత డబ్బుందండీ. అవసరమైతే తీసుకొందాం" అన్నది కమల.

"ఛా...ఛా...మీ అమ్మ దగ్గర డబ్బు తీసుకొందామా? పాపం ఆమె ఏం కొనుక్కోవాలని తెచ్చుకుందో?" అన్నాడు.

"ఎందుకో కాదులెండి. మనకి అవసరం పడుతుందనే తెచ్చింది"

"సమయానికి ఆమె వచ్చి నీకు సహాయంగా వుంది. అంతే చాలు. మళ్ళీ ఆమె డబ్బు ఖర్చుపెట్టడం బాగుండదు"

కమల ధోరణి చూస్తుంటే, ఆమెకు గాజులు తాకట్టు పెట్టడం ఇష్టంలేనట్టు తెలిసిపోతూవుంది. ఆడవారికి బంగారం మీద మోజెక్కువ. ఎంత బంగారం కొన్నా వద్దనరు. అదొక తృప్తి. ఇక వున్నది అమ్ముదామంటే కష్టంగా వుంటుంది. తాకట్టు పెడితే వదిలించలేమని భయం అనుకున్నాడు రఘురామ్.

"కమలా! భయపడకు. గాజులు తాకట్టు పెట్టి డబ్బు తెచ్చిన నెలకే మళ్ళీ విడిపిస్తాను. ఆఫీసులో లోన్‌కి అప్లయ్ చేశాను. ఆ డబ్బు నెలలోపల వస్తుంది" అన్నాడు అభయమిస్తూ.

"సరే! గాజులు ఎందుకులెండి. నల్లపూసల గొలుసు తాకట్టు పెట్టండి" అన్నది హీనస్వరంతో కమల.

"దానికి పాతికవేలు వస్తుందంటావా? అంత ఇస్తాడా మార్వాడీ?" అన్నాడు.

"ఎందుకివ్వడూ? మీరు చేయించిందేగదా? నాలుగు తులాల గొలుసు!" అన్నది.

"సర్లే నీ ఇష్టం. ఏదైనా ఒక నెలకేగదా!" అన్నాడు.

కమల తలూపింది. రఘురామ్ ఆలోచనలో పడ్డాడు. నల్లపూసల గొలుసైనా, బంగారు గాజులైనా ఒకటేగదా? ఏవైనా బంగారమే. ఐతే తను గాజుల

తాకట్టు పెడతానంటే కమల ఎందుకు ఒప్పుకోలేదు?

నల్లపూసల గొలుసు అత్తగారు పెట్టింది. గాజులు పుట్టింటివారు చేయించినవి. అదీ సంగతి! పుట్టింటి బంగారం తాకట్టు పెట్టడం ఆమెకు ఇష్టం లేదు. ఎందుకంటే తను వాటిని తాకట్టు నుంచి విడిపిస్తానని ఆమెకు నమ్మకం లేదు. డబ్బు కట్టకపోతే మార్వాడీ ఆ గాజులు సొంతం చేసుకుంటాడు. పుట్టింటి వారిచ్చిన గుర్తు ఏమీ మిగలదు. అదీ ఆమె సెంటిమెంట్. తను ఏదో గొప్ప విషయం కనిపెట్టినవాడిలా తృప్తి పడ్డాడు రఘురామ్.

తన పెళ్ళి ముహూర్తం పెట్టినప్పటి సంఘటన అతనికి గుర్తొచ్చింది. తనకు, అన్నకు ఒకేసారి పెళ్ళి జరిగింది. వదిన పుట్టింటి వాళ్లు ఆమెకు నాలుగు బంగారు గాజులు చేయిస్తామని అన్నారు. తాము నాలుగు తులాల నల్లపూసల గొలుసు పెళ్ళిలో పెడతామని తన తల్లి ఒప్పుకుంది. అలాగే కమల తండ్రిని కూడా నాలుగు బంగారు గాజులు చేయించమని డిమాండ్ చేసింది తల్లి. ఆయన తనవల్లకాదన్నాడు. ఐతే తల్లి 'పెద్ద కోడలికి నాలుగు బంగారు గాజులు పెడుతున్నారు. చిన్న కోడలికి లేకపోతే పెళ్ళిలో ఏం బాగుంటుంది? అన్నయ్యగారూ! మీకు తెలియదు...మీ అమ్మాయే చిన్న బుచ్చుకుంటుంది. చిన్న చిన్నవి ఏవైనా ఉంటే చెడగొట్టి ఎట్లాగో తిప్పలు పడి గాజులు చేయించండి' అని నచ్చచెప్పింది. ఆయన అయిష్టంగానే ఒప్పుకున్నాడు. నిజానికి ఆయనకు పెళ్ళి జరిపించడమే కష్టంగా ఉందని తను గ్రహించగలిగాడు. ఏం తిప్పలు పడ్డాడో? మొత్తానికి కమలకు బంగారు గాజులు చేయించాడు. పుట్టింటి వారు ఇచ్చినవని కమలకు వాటి మీద అంత మమకారం. వాటిని ఎంతో అపురూపంగా చూసుకుంటుంది. రెగ్యులర్‌గా వేసుకోదు. ఎప్పుడైనా సినిమాలకు, పెళ్ళిళ్లకు, పేరంటానికి ధరించి మురిసిపోతూ ఉంటుంది.

ఆరోజు కమలకు బాగా నలతగా ఉంది. జ్వరం వచ్చే సూచనలు కనిపించాయి. ఆఫీసుకి బయల్దేరుతూ కమల నల్లపూసల గొలుసు తీసుకెళ్ళి సాయంకాలం తిరిగి వచ్చేటప్పుడు మార్వాడీ దగ్గర తాకట్టు పెట్టి డబ్బు తేవాలనుకున్నాడు. రేపు కమలను హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి. ఎంత బిల్లు వేస్తారో తెలియదు. రఘురామ్ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. కమల నిద్ర పోతూ వుంది. నల్లపూసల గొలుసు ఆమె ఎప్పుడూ మెడలోనే వేసుకుంటుంది. నిద్ర లేపబుద్ధి కాలేదు.

'తను బంగారాన్ని అమ్మబోవడం లేదు. కేవలం తాకట్టు పెడుతున్నాడు. అంతే! నల్లపూసల గొలుసైనా, బంగారు గొలుసైనా ఒకటే!'

రఘురామ్ బీరువా తీశాడు. సేఫ్ లాకర్లో ఉన్న బంగారు గాజులున్న బాక్స్ తీసుకుని ఆఫీసుకు బయల్దేరాడు.

★ ★ ★

రఘురామ్ ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి ఎనిమిదైంది. కమల మంచం మీద కూర్చుని ఉంది. జ్వరం ఉన్నట్లుంది. ముఖం వాడిపోయి ఉంది.

"కమలా! పద హాస్పిటల్‌కి వెళ్దాం" అన్నాడు.

"అయ్యో! మీరు ఇప్పుడేగా ఆఫీసునుంచి వచ్చింది. రేపు వెళ్దాంలెండి అంతగా తగ్గకపోతే" అన్నది కమల.

"అంతా మన ఇష్టమేనా? డాక్టర్లు చెప్పింది వినాలి కదా! జ్వరం వస్తే వెంటనే రమ్మన్నారు. రేపు జబ్బు ముదిరి తిరగబెడితే బాధ్యత ఎవరిది? అంతా నన్నేగా అంటారు" కోపంగా అన్నాడు.

"అయ్యో! కోప్పడకండి" అన్నది కమల కళ్ళొత్తుకుంటూ.

అతను మాట్లాడలేదు. హేండ్‌బ్యాగ్‌లో నుంచి గాజులున్న పెట్టె బైటకు తీశాడు.

"ఆఫీసుకు వెళ్ళేటప్పుడు నల్లపూసల గొలుసు తీసుకెళ్ళి తాకట్టు పెడదామనుకున్నాను. నేను బయల్దేరే సమయానికి నువ్వు నిద్రపోతున్నావు. గొలుసు నీ మెడలో ఉంది. గాజులు తీసుకెళ్ళాను" అంటూ కమలవైపు చూశాడు. కమల ముఖం తెల్లగా పాలిపోయింది. అయోమయంగా భర్త ముఖంలోకి చూసింది.


"నన్ను క్షమించండి! మీకీ విషయం ఎప్పుడో చెప్పాల్సింది" అని కమల ఏడవటం మొదలుపెట్టింది.

"పిచ్చిదానా! ఇటువంటి అడ్జెస్ట్‌మెంట్లు మన మధ్య తరగతి కుటుంబాలలో మామూలే! నువ్వేం బాధపడకు!" అన్నాడు అనునయంగా.

గంటక్రితం గాజులు చూసి మార్వాడీ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"సార్! మీకు తెలియక తెచ్చి ఉంటారు. ఇవి ఇత్తడి గాజులు. బంగారు రేకుతో కవర్ చేశారు"

★



## పార్కౌర్ ఔత్సాహికుని ఫీట్

'పార్కౌర్' అనేది ఒక సాహస క్రీడ. దూకడం, పాకడం, కొండలు ఎక్కడంలాంటి వాటిలో మంచి సాధన చేసిన వాళ్లకే ఈ క్రీడలో విజేతలు కాగల సామర్థ్యం వుంటుంది. ఇటీవల రష్యాలోని సెయింట్ పీటర్‌బర్గ్ నగరంలో ఒక ఔత్సాహికుడు 60 అడుగుల ఎత్తయిన భవనం మీద నుంచి 23 అడుగుల దూరంగా వున్న 46 అడుగుల ఎత్తయిన భవనం మీదకి దూకి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసాడు. అతనెంత సాధకుడంటే సూపర్‌మేన్‌లా ఏ గాయమూ లేకుండా సురక్షితంగా లేండ్ అయ్యాడు.

-తటవర్తి

